సాక్షి
మంచిర్యాల
మంగళవారం : 4 : ఏప్రిల్ : 2023



తల్లిదండ్రులకూ పరీక్షే..!

పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే ఎగ్జామ్ సెంటర్ అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పట్లేదు. 8లో ▸



వేటగాళ్ల ముఠా పట్టివేత

పులిచర్మం విక్రయించేందుకు యత్నిస్తున్న వేటగాళ్ల ముఠాను మహారాష్ట్ర అటవీ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.4 /25.5

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి ఎక్కువగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉండి ఉక్కపోతగా అనిపిస్తుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ మంగళ : 6:30
సహర్ మంగళ : 4:44

ఆత్మీయం.. అసంతృప్తి!



లక్సెట్టిపేటలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి నారాదాసు లక్ష్మణరావు



జన్నారంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం

- అధికార బీఆర్‌ఎస్‌లో అసమ్మతి
- బయటపడుతున్న విభేదాలు
- కొన్నిచోట్ల మొక్కుబడిగా సమ్మేళనాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాల్లో అసంతృప్తులు బయటపడుతున్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో ఐక్యత పెంచాలని సమ్మేళనాలు నిర్వహిస్తుంటే విభేదాలు పొడచూపుతున్నాయి. ఆత్మీయ సమ్మేళనాలతో విభేదాలు సమసిపోతాయనుకుంటే కొత్తవి బయటపడుతున్నాయి. ఇది నాయకులకు తలనొప్పిగా మారుతోంది.

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో..

జిల్లాలో నాలుగు నియోజకవర్గాలైన మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, ఖానాపూర్(జన్నారం)పరిధిలో సమ్మేళనాలు జరుగుతున్నాయి. మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణరావు జిల్లాకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అయితే చాలాచోట్ల స్థానిక నాయకత్వం, ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య సఖ్యత లేకపోవడంతో అధిష్టానం ఆశించిన మేరకు ఆత్మీయ సమ్మేళనాలు సాగడం లేదు. గతనెల జన్నారం మండల పరిధిలో జరిగిన సమ్మేళనానికి చాలా మంది స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు దూరంగా ఉన్నారు. స్థానిక జెడ్పీటీసీ, ఎంపీపీ, ఏఎంసీ వైస్ చైర్మన్‌సహా కీలకంగా ఉండే మండల, జిల్లాస్థాయి నాయకులు సైతం హాజరు కాలేదు. ఇక్కడి ఎమ్మెల్యేకు కిందిస్థాయి నాయకుల మధ్య వైరమే ఇందుకు కారణమని చెబుతున్నారు.

సిట్టింగులకు సవాల్..

ఎన్నికల వేళ నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపైకి తేవడం అధికార బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సవాల్‌గా మారింది. వచ్చే ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించేది క్యాడరే. చాలా గ్రామాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులే ఎమ్మెల్యేలపై అసంతృప్తితో ఉన్నారు. మంచిర్యాల పరిధిలో కొందరు నాయకులు ఎమ్మెల్యే చెప్పినా తీరు మార్చుకోవడం లేదు. దండేపల్లి నుంచి హాజీపూర్ వరకు పార్టీ మెరుగ్గానే ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రం, నస్పూర్, శ్రీరాంపూర్ కార్మిక క్షేత్రంలో నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఇక చెన్నూరులో ఒక్కో మండలంలో ఒక్కో తీరు అన్నట్లు ఉంది. కోల్‌బెల్ట్ ప్రాంతమైన మందమర్రి, రామకృష్ణాపూర్ పరిధిలో అసంతృప్తి ఉంది. కొంత మంది నాయకులే లీడర్లుగా చెలామణి కావడం కింది స్థాయి కార్యకర్తలు, నాయకులకు నచ్చడం లేదు. ఇక జైపూర్, భీమారం, చెన్నూరు, కోటపల్లి పరిధిలోనూ కొంత మందికే పెత్తనం ఉందనే విమర్శలు ఉన్నాయి. బెల్లంపల్లిలోనూ వర్గాలుగా ఉండడంతో కార్యకర్తలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఉద్యమకారులకు దక్కని ప్రాధాన్యం..

తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న పలువురు కార్యకర్తలు ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగడం లేదనే అపవాదు ఉంది. అయినా ఎమ్మెల్యేలు ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, కొత్తగా పార్టీలో చేరిన వాళ్లు, వేరే పార్టీ నుంచి వచ్చిన వాళ్లు, అనుభవం లేని వారికి ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని సామాజికవర్గాలకే పెద్దపీట వేయడం అసంతృప్తికి కారణమవుతోంది. ఆత్మీయ సమ్మేళనాల్లో వీటన్నింటికీ చెక్ పెట్టాలని అధిష్టానం గ్రామస్థాయి నుంచే సమ్మేళనాలకు ప్రణాళిక రూపొందించింది. అయితే జిల్లాలో ఆశించిన తీరుగా సమ్మేళనాలు సాగడం లేదు.

మొక్కుబడిగా నిర్వహణ..

ఆత్మీయ సమ్మేళనాలు చాలా చోట్ల మొక్కుబడిగా ముగుస్తున్నాయి. గ్రామ జనాభా, ప్రాంతం, పార్టీ బలం తదితర అంశాలను బేరీజు వేసుకుని పది గ్రామాలు, లేకపోతే మండలాల వారీగా సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. చెన్నూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుమన్ పర్యటించినప్పుడు కనిపించే హడావుడి ఆ తర్వాత ఉండడం లేదు. సభలు, సమావేశాలు, సమ్మేళనాలతో పార్టీని ప్రజల్లో బలపడేలా చేయాలనుకోవాలని భావించినా నిర్వహణలో మాత్రం విభిన్నంగా ఉంటోందని కార్యకర్తలే చెబుతున్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన 'పది' పరీక్షలు



పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు



తనిఖీలు చేసి కేంద్రంలోకి పంపుతున్న అధికారులు



కేంద్రం వద్ద తల్లిదండ్రులు, విద్యార్థుల సందడి

- తొలి రోజు 53 మంది గైర్హాజరు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షలు జిల్లాలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణకు 55 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 10,169 విద్యార్థులకు 10,103 మంది విద్యార్థులు హాజరయ్యా రు. రెగ్యులర్ విద్యార్థులు 10,125 మందికి 10,072(99.48శాతం) హాజరయ్యారు.53 మంది గైర్హాజరయ్యారు. గతంలో ఫెయిలైన 44 మంది విద్యార్థులకు 31 మంది హాజరు కాగా, 13 మంది గైర్హాజరయ్యారు. మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి బస్సు సౌకర్యం లేకపోవటంతో ఆటోలో రైల్వే ట్రాక్ వరకు వచ్చి అక్కడి నుంచి నడుచుకుంటూ ట్రాక్ దాటి విద్యార్థులు కేంద్రానికి చేరుకున్నారు. మొదట 8:30 గంటలకు విద్యార్థులను లోపలికి పంపించిన అధికారులు, మళ్లీ వెనక్కి పంపి 9 గంటల ప్రాంతంలో తనిఖీల అనంతరం పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. బాలుర ఉన్నత పాఠశాల, ఆర్‌బీహెచ్‌వీతోపాటు పలు కేంద్రాలను డీఈవో వెంకటేశ్వర్లు, మరో 20 పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. చాలామంది విద్యార్థులు తమ కుటుంబసభ్యుల సహకారంతో కేంద్రాలకు వచ్చారు. కొంత మంది విద్యార్థులు ఆలయాల్లో పూజలు చేసి పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేసిన అనంతరం లోపలికి పంపించారు. విద్యాశాఖ గుర్తింపు కార్డులు జారీ చేసిన పరీక్ష నిర్వాహకులు మినహా ఇతరులను అనుమతించలేదు. కేంద్రాల్లో ప్రత్యేకంగా వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ప్రతీ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్ష సమయంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేశారు. మొదటి రోజు మాల్‌ప్రాక్టీస్ లేకపోవటం.. ప్రశాంతంగా పరీక్ష ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

న్యూస్‌రీల్

వసతిగృహాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



భోజనం తనిఖీ చేస్తున్న మధుసూదన్‌నాయక్

భీమారం: మండల కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు రాత్రి అందించే భోజనం పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్ సాయిలచ్చన్నని ఆదేశించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. శ్రద్ధగా చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌పై చర్య తీసుకోవాలి



రాష్ట్రపతికి రాసిన ఉత్తరాలతో నిరుద్యోగులు

పాతమంచిర్యాల: టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాల లీకేజీ బాధ్యులపై చర్య తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రేంకుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిరుద్యోగులు, విద్యార్థులతో కలిసి రాష్ట్రపతికి సోమవారం ఉత్తరాలు రాశారు. ప్రశ్న పత్రాల లీకేజీకి బాధ్యుడిని చేస్తూ టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలని కోరారు.

కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్‌గా ఖలీద్



నియామకపత్రం అందిస్తున్న ప్రేంసాగర్‌రావు

నస్పూర్: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్‌గా నస్పూర్‌కు చెందిన ఖలీద్ నియమితులయ్యారు. ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సోమవారం నియామకపత్రం అందించారు. ఖలీద్ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

18న వేజ్‌బోర్డు సమావేశం

శ్రీరాంపూర్: ఈ నెల 18న జేబీసీసీఐ–11(వేజ్ బో ర్డు) సమావేశం కోల్‌కత్తాలోని కోలిండియా భవన్‌లో జరుగనుంది. ఈ మేరకు కోలిండియా యాజమాన్యం జేబీసీసీఐలోని జాతీయ సంఘాల ప్రతి నిధులకు ఆహ్వానం పంపింది. ఇది వరకు కేవలం 19శాతం మినిమం గ్యారెంటీ బెన్‌ఫిట్ పైనే అవగాహన ఒప్పందం కుదురగా మిగిలిన అలవెన్సులు, ఇతర అంశాలపై ఇందులో చర్చించనున్నారు.

అటవీ ప్రాంతంలో నీటి వనరుల పరిశీలన

బెల్లంపల్లి రేంజ్ పరిధిలోని ముత్యంపల్లి, ధర్మరావుపేట సెక్షన్‌లలో అటవీ ప్రాంతంలో జంతువులకు నీటివనరుల కల్పనకు కట్టించిన చెక్ డ్యాం, నీటికుంటలు, రోడ్డు నిర్మాణ పనులు, ఎస్‌సీటీల పైన పెంచిన ఔషధమొక్కల ప్లాంటేషన్ పనులను ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్(ఎఫ్‌డీపీటీ) వినోద్‌కుమార్ పరిశీలించారు. 10లో ▸

ప్రజావాణికి వినతుల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్



నోటీసులు చూపిస్తున్న వృద్ధ మహిళలు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ మధుసూదన్ అర్జీలు స్వీకరించారు. దండెపల్లి మండలం రాజంపేట గ్రామానికి చెందిన వృద్ధ మహిళలు తమకు వికలాంగుల ఫించన్ మంజూరు చేశారని, అయితే సదరెం సర్టిఫికెట్లు నకిలీవని పింఛన్ నిలిపివేశారని తెలిపారు. తమకు పింఛన్ మంజూరు చేయించాలని కోరారు.

- సీసీసీకి చెందిన ఓరుగంటి నర్సమ్మ ఉద్యోగం కోసం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు విన్నవించింది. తన కొడుకును 20 ఏళ్ల క్రితం పోలీసులు కాల్చి చంపారని, తనకు ఎలాంటి జీవనాధారం లేదని, నాడు ఆదిలాబాద్ కలెక్టర్‌కు విన్నవించగా మంచిర్యాల ఎంపీడీవో కార్యాలయంలో తాత్కాలికంగా ఉద్యోగం ఇచ్చారని వెల్లడించారు. ఆరు నెలలు ఉద్యోగం చేసి జీతం కోసం అడగగా అపాయింట్‌మెంట్ ఆర్డర్ లేనిదే జీతం రాదని తెలిపారన్నారు. నియామక పత్రం కోసం నాటి నుంచి తిరుగుతున్నానని, మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లకు విన్నవించినా న్యాయం జరుగడం లేదని వివరించారు. ప్రభుత్వం రెండెకరాల భూమి సైతం ఇస్తామని ఇవ్వలేదని పేర్కొన్నారు.
- మంచిర్యాల తిలక్‌నగర్‌లో 400 గజాల స్థలం నాలుగేళ్ల క్రితం కొనుగోలు చేశానని, ఆ స్థలాన్ని చిప్పకుర్తి నారాయణ ఆక్రమించి షెడ్డు వేశాడని, స్థలం తనదే అని బెదిరిస్తున్నాడని పెద్దపల్లి జిల్లా యైటింక్లయిన్‌కాలనీకి చెందిన గంట జెన్నయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.
- కాసిపేట మండలం దుబ్బగూడెం గ్రామం కళ్యాణిఖని ఓపెన్‌కాస్టులో ముంపునకు గురికాగా పునరావాసం కల్పించలేదని నిర్వాసితులు తెలిపారు. ప్రాజెక్టు డిపెండెంట్ ఫ్యామిలీ సర్టిఫికెట్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండినవారికి పునరావాసం కల్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

రోడ్డుకు ఇరువైపులా భూసేకరణ చేయాలి



ఎన్‌హెచ్‌ఏఐ అధికారికి విన్నవిస్తున్న బాధితులు



రాస్తారోకో నిర్వహిస్తున్న పట్టణవాసులు

- జాతీయ రహదారి 63 బాధితుల డిమాండ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల–ఆర్మూర్ జాతీయ రహదారి 63 విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా భూసేకరణ చేపట్టాలని హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన ఎన్‌హెచ్ 63 బాధితుల సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు కలెక్టరేట్, ఎన్‌హెచ్‌ఏఐ కార్యాలయాల్లో సోమవారం వినతిపత్రాలు అందజేశారు. నూతన రోడ్డు విస్తరణలో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోతున్న వారంతా తమకు న్యాయం జరగాలని కోరుకుంటూ ఎన్‌హెచ్ 63 బాధితుల సంఘంగా ఏర్పాటయ్యారు. జిల్లాలోని గూడెం నుంచి క్యాతన్‌పల్లి వరకు 36 కిలో మీటర్ల మేర నిర్మాణం చేపట్టబోయే నాలుగు వరసల రహదారితో తమ భూములు, ఇళ్లు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణం కోసం విలువైన ఇళ్లు, వ్యవసాయ భూములు ఇచ్చామని పేర్కొన్నారు. ఆ సమయంలో గుడిపేటలో రోడ్డుకు భూములు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నామని తెలిపారు. తాజాగా జాతీయ రహదారి విస్తరణ అంటూ భూ సేకరణ ప్రకటనతో ఆందోళనగా ఉందన్నారు. రోడ్డు విస్తరణలో తీవ్రంగా నష్టపోతామని పేర్కొన్నారు. రోడ్డుకు ఒకవైపు భూ సేకరణ చేపడితే ఇళ్లు మొత్తం కోల్పోవాల్సి వస్తుందని వెల్లడించారు. ఇరువైపులా భూ సేకరణ చేపడితే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ 63 బాధితుల సంఘం సభ్యులు కందుల రమేశ్, బయ్య సంతోష్, బొడ్డు మల్లేశ్, సురేశ్, డాక్టర్ రాజు, బోడకుంటి మల్లేశ్, బాపు పాల్గొన్నారు.

బైపాస్ కోసం రాస్తారోకో..

లక్సెట్టిపేట: జాతీయ రహదారి 63 కి బైపాస్ రోడ్డు వేయాలని, పట్టణం మధ్య నుంచి రోడ్డు వేయొద్దని పట్టణవాసులు స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం రాస్తారోకో చేశారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం అందించారు. 63వ జాతీయ రహదారి పట్టణం మధ్య నుంచి వేయడం వలన రోడ్డు పక్కన ఉన్న ఇళ్లు కోల్పోతామని, వ్యాపారాలు దెబ్బతింటాయని, జీవనోపాధి కోల్పోతామని వెల్లడించారు. పట్టణం బయటి నుంచి జాతీయ రహదారి నిర్మించాలని కోరారు. పనులు ప్రారంభించకముందే నూతన రోడ్డును అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు మేలు చేయని ప్రభుత్వం

- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- భీమారం, జైపూర్‌లో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర



పాదయాత్రలో భట్టి విక్రమార్క

భీమారం/జైపూర్: తెలంగాణ సెంటిమెంటుతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయడం లేదని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. హాథ్‌సే హాథ్ జోడో యాత్ర కొనసాగింపులో భాగంగా చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చెన్నూరు నియోజకవర్గంలోని భీమారం, జైపూర్ మండలాల్లో సోమవారం సాగింది. భీమారం మండలం పోలంపల్లి నుంచి ప్రారంభమైన యాత్ర రాత్రి జైపూర్‌కు చేరుకుంది. పోలంపల్లిలో, జైపూర్ కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడారు. తెలంగాణ వస్తే జీవితాలు బాగుపడుతాయనుకున్న ప్రజల ఆశలపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం నీళ్లు చల్లిందని ఆరోపించారు. తొమ్మిదేళ్ల పాలనలో హామీలేవీ నెరవేర్చలేదన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను కేసీఆర్ విస్మరించారని విమర్శించారు. కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే తెలంగాణలో బాగుపడిందని పేర్కొన్నారు. సాయంత్రం జైపూర్ మండల కేంద్రానికి చేరుకోగా పార్టీ శ్రేణులు టపాసులు కాల్చి ఘనస్వాగతం పలికాయి. మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు యాత్రలో పాల్గొన్నారు. బాంచన్ దొర బతుకులు పోవాలంటే బీఆర్‌ఎస్ను గద్దె దించాలని పిలుపునిచ్చారు. జైపూర్ మీదుగా పెగడపల్లి, గంగిపల్లి వరకు యాత్రసాగింది. రాత్రికి గంగిపల్లిలో బస చేశారు. పాదయాత్రలో డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి విజయరమణరావు, చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నూకల రమేశ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఎండీ.ఫయాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పూర్తి పోషకాలు



పోషకాహారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలటౌన్: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా శరీరానికి పూర్తిస్థాయిలో పోషకాలు అందుతాయని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. కలెక్టరేట్‌లో పోషణ్ పక్వాడ ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట పోషకాహారాల ప్రదర్శనతోపాటు, పోషక పదార్థాలతో చేసిన డిజైన్ ఆకట్టుకున్నాయి. కలెక్టర్‌కు జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య వాటి గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చిరుధాన్యాల వినియోగంపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు. వీటితో కలిగే లాభాలను పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు వివరించాలన్నారు. 2018 నుంచి సెప్టెంబర్, మార్చి నెలల్లో తక్కువ బరువు ఉన్న పిల్లలు, కిశోర బాలికలకు చిరుధాన్యాల ద్వారా పౌష్టికాహారం అందించేందుకు 15 రోజులపాటు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అవగాహన కల్పించారని వివరించారు. జిల్లాలో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది, సూపర్‌వైజర్లు, సీడీపీవోలు సమన్వయంతో కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. పక్షం రోజులు పోషణ పక్షం కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

'మెడికల్' స్థలంపై మల్లగుల్లాలు!

- ఇప్పటికే ఐదు స్థలాలను తిరస్కరించిన మెడికల్ బోర్డు
- తాజాగా గుడిపేట స్థలం ప్రతిపాదన?

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మెడికల్ కళాశాలకు శాశ్వత భవన నిర్మాణానికి స్థలం దొరకడం లేదు. కాలేజ్ రోడ్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో తాత్కాలికంగా నిర్మించిన భవనంలో ఈ ఏడాది తరగతులు ప్రారంభించారు. అయితే శాశ్వత భవన నిర్మాణానికి రెండేళ్లుగా అధికారులు స్థలాన్వేషణ చేస్తున్నా కొలిక్కి రావడం లేదు. ఇప్పటి వరకు మంచిర్యాల కాలేజీరోడ్(గోదావరిరోడ్)లోనే భూదాన్ బోర్డులో ముందుగా మెడికల్ కళాశాల ప్రతిపాదనకు రాగా, గోదావరికి సమీపంలో ఉండడంతో అనువుగా లేదని రోడ్లు, భవనాల శాఖ నివేదిక ఇచ్చింది. తర్వాత ఇందారం, నస్పూర్‌లో స్థలాలు ప్రతిపాదించారు. అక్కడ కూడా పలు కారణాలతో వెనకడుగు వేశారు. సీసీసీలో 45 ఎకరాలు మెడికల్ కళాశాలకు ఇస్తామని సింగరేణి ముందుకు వచ్చినా ఆ స్థలానికి సమీపంలో ఓపెన్‌కాస్ట్ ఉండటంతో మెడికల్ బోర్డు తిరస్కరించింది. తర్వాత మంచిర్యాల పట్టణంలోని సాయికుంటలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు దాదాపు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. అయితే ఈ ప్రాంతం ముంపు ప్రాంతమని, కళాశాల ఏర్పాటు జరిగితే ఇరుకు రోడ్లతో ఇబ్బందులు తప్పవని మెడికల్ బోర్డు తిరస్కరించింది.

తెరపైకి గుడిపేట..

తాజాగా జిల్లా కేంద్రాన్ని ఆనుకుని ఉన్న హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ సమీపంలోని అటవీ నర్సరీ సమీపంలోని 294, 300 సర్వే నంబర్లలో 40 ఎకరాల స్థలాన్ని మరోమారు తెరపైకి తెచ్చారు. గతంలో ఈ స్థలం జిల్లా కేంద్రంలో లేదని తిరస్కరించారు. తాజాగా గుడిపేట స్థలం తెరపైకి రావడం కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదివారం పరిశీలించడం జరిగాయి. సోమవారం వైద్య, ఆరోగ్య శాఖ, మెడికల్ బోర్డు, జిల్లా అధికారులు స్థలాన్ని పరిశీలించారు.

క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన..

గుడిపేటలో మెడికల్ కళాశాల నిర్మాణం సాధ్యాసాధ్యాలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ మూర్తుజా, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి రమేశ్, తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మౌలిక వసతుల సంస్థ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, శిక్షణ కలెక్టర్ గౌతమితోపాటు రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు స్థలం పరిశీలించారు. గుడిపేట జాతీయ రహదారికి దాదాపు కిలోమీటర్ దూరం, మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి 10 కిలో మీటర్ల దూరం ఉండడంతో రాష్ట్ర వైద్య శాఖ అధికారులు జిల్లా కేంద్రానికి దూరంగా ఉందని పేర్కొన్నారు. మరోసారి పరిశీలిద్దామని వెళ్లిపోయారు. అయితే గుడిపేట స్థలం అనువుగా ఉంటుందని కలెక్టర్ సంతోష్, సర్వేయర్ మధుర్ అధికారులకు వివరించినా ఉన్నతాధికారులతో చర్చించిన తర్వాత నిర్ణయం ప్రకటిస్తామని వెళ్లిపోయారు. దీంతో ఈ స్థలం కూడా ఫైనల్ అయ్యే అవకాశం కనిపించడం లేదు.



గుడిపేట శివారులో స్థలం పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ, మెడికల్ బోర్డు అధికారులు, కలెక్టర్

క్లుప్తంగా

ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి


రవి వాల్మీకి (ఫైల్)

మందమర్రిరూరల్: గత నెల 29న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బొడ్డు రవి వాల్మీకి (46) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ... ఒర్రెగడ్డ ఏరియాకు చెందిన రవి గత నెల 29న ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. రవిని 108లో మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి సోదరుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. రవి ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య కనకలక్ష్మి, ఈశ్వర్‌వాల్మీకి, సింహ వాల్మీకి ఉన్నారు.

ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్‌అర్బన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఔట్ సోర్సింగ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు శేఖర్ తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా బాబుగౌడ్ ఎన్నిక కాగా అధ్యక్షుడిగా దుర్గం శేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భాస్కర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్, చీఫ్ అడ్వైజర్‌గా శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా మనోహర్, రుక్మారెడ్డి, సునీల్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా మురళి, కోశాధికారిగా దేవేందర్, సభ్యులుగా శ్యాంకుమార్, దేవేందర్, రజిత, పవన్‌లు ఎన్నికైనట్లు తెలిపారు.

అంబులెన్స్ యజమానుల దౌర్జన్యం


ధర్నాలో జర్నలిస్ట్ సంఘాల నాయకులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో అంబులెన్స్ యాజమాన్యాల దోపిడీ, దౌర్జన్యాన్ని నిరసిస్తూ జర్నలిస్టు సంఘాల నాయకులు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట సోమవారం ఆందోళన చేశారు. మందమర్రికి చెందిన జర్నలిస్టు రవి రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌తో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతదేహాన్ని మందమర్రికి చెందిన నార్ల నరేశ్ అంబులెన్స్‌లో రిటన్ కిరాయి, హైదరాబాద్ నుంచి మంచిర్యాలకు, మంచిర్యాల నుంచి మందమర్రికి రూ.8వేలకు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చాడు. పోస్ట్‌మార్టం తర్వాత మందమర్రికి తరలించాల్సి ఉండగా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఉన్న అంబులెన్స్‌ల యజమానులు ఎండీ.సల్మాన్ (అంబులెన్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్), ఆర్వి ఎస్.నరేష్, పులి సంతోష్, ఓజోజు మహేష్, ప్రేమ్ ప్రసాద్ అడ్డుకున్నారు. రూ.3 వేల చెల్లించాల్సిందేనని డిమాండ్ చేయడంతో మృతుడి కుటుంబ సభ్యులు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు అంబులెన్స్‌ల యజమానులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం రోడ్డుపై బైఠాయించారు. సీఐ రాజు హామీతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని మందమర్రికి తరలించారు.


దండేపల్లి: విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు


నిర్మల్‌లో..


దహెగాంలో..

‘పది’లంగా పరీక్షకు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం మొదలయ్యాయి. విద్యార్థులు ఉదయం 9గంటల వరకే పరీక్ష కేంద్రానికి చేరుకుని వారివారి హాల్‌టికెట్ నంబర్లు చూసుకోవడంలో బిజీగా మారారు. గ్రామాల నుంచి పరీక్ష కేంద్రానికి వచ్చేందుకు పలువురు విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. అలాగే ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు సైతం వాహనాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం పరీక్ష కేంద్రానికి తరలివచ్చారు. అయితే కడెం మండలంలో విద్యార్థి రోహిత్ తండ్రి ఆదివారం రాత్రి మృతిచెందగా పుట్టెడు దుఃఖంతో పరీక్షకు హాజరు కాగా పలువురు దివ్యాంగ విద్యార్థులు సైతం పది పరీక్షలు రాశారు.


కెరమెరి: కాలు విరిగి పోవడంతో పరీక్షకు..


తాండూర్: దివ్యాంగ విద్యార్థిని తీసుకొస్తూ..


కడెం: తండ్రి మరణించిన పరీక్ష రాసేందుకు వచ్చిన రోహిత్


నార్నూర్‌లో పరీక్ష రాస్తున్న అంధ విద్యార్థి అనిల్


చింతలమానెపల్లి: హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటూ..


నిర్మల్‌లో పరీక్ష కేంద్రం వద్ద పోలీసు సిబ్బంది


తాంసి: కప్పర్ల పాఠశాలలో నానమ్మ గంగుబాయితో దివ్యాంగ విద్యార్థి సిద్ధార్థ్


నెన్నెల: ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న విద్యార్థులు


నిర్మల్‌లో విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఉపాధ్యాయురాలు


దండేపల్లి: లింగాపూర్‌లో స్క్రైబ్ సాయంతో పరీక్షకు అంధ విద్యార్థి

దొంగతనానికి పాల్పడిన ఇద్దరి రిమాండ్

- స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం


మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

కాసిపేట: పెద్దనపల్లి శివారు వైన్స్‌షాప్‌లో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని, మరొక్కరు పరారీలో ఉన్నట్లు మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. పెద్దపల్లి జిల్లాకు చెందిన మహ్మద్ సమీర్, అబ్దుల్ షాకీబ్, ఎండీ గౌడ్‌లు గత నెల 19న రాత్రి 2గంటల సమయంలో ఆర్ఎస్ వైన్స్‌కు వెళ్లి మూడు సీసీ కెమెరాలు ధ్వంసం చేసి ఇనుప రాడ్లతో వైన్స్ షట్టర్ తాళాలు పగలగొట్టారు. షాపులోని రెండు మొబైల్ ఫోన్లు, రూ.20వేల నగదు, లిక్కర్ బాటిల్స్ దొంగిలించారు. అనంతరం గౌస్ కరీంనగర్ వెళ్లగా వీరిద్దరు మళ్లీ దొంగతనం చేసేందుకు రెక్కీ నిర్వహించేందుకు బెల్లంపల్లి వైపు వెళ్తుండగా తనిఖీల్లో భాగంగా పోలీసులు అనుమానం వారి వారిని విచారించగా నిజం ఒప్పుకున్నారు. వీరి వద్ద నుంచి స్కూటీ, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఇందులో ఎస్సై గంగారాం, ఏఎస్సై రవీందర్ ఉన్నారు.

పర్మినెంట్ సెక్యూరిటీ గార్డులను నియమించాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి


జీఎంకు వినతి పత్రం అందిస్తున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణిలో పర్మినెంట్ సెక్యూరిటీ గార్డులను నియమించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు టి.రాజారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్‌లోని ఎస్అండ్‌పీసీ కార్యాలయం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. కంపెనీలో చాలా కాలంగా పర్మినెంట్ సెక్యూరిటీ గార్డులను నియమించలేదన్నారు. కేవలం కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డులను తీసుకుంటున్నారన్నారు. పర్మినెంట్ సెక్యూరిటీ గార్డులను తగ్గిస్తే కంపెనీ ఆస్తులకు రక్షణ కొరవడుతుందన్నారు.

జీఎంకు మెమోరాండం సమర్పణ..

అనంతరం జీఎం సంజీవరెడ్డిని కలిసి క్వార్టర్ల సమస్యలపై వినతి పత్రం అందించారు. గోదావరిఖని నుంచి శ్రీరాంపూర్ డివిజన్ గనులకు వచ్చిన పని చేస్తున్న అక్కడి స్థానికులకు గోదావరిఖనిలోని సెక్టార్ 2లో ఉన్న క్వార్టర్లను అలాట్ చేయాలని జీఎంను కోరారు. ఆయూనియన్ బ్రాంచి నాయకులు గుల్ల బాలాజీ, హరీశ్, సాయిరాం ఉన్నారు.

‘ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ’


పోస్టుకార్డులు పంపుతున్న కాంగ్రెస్ నేతలు

జన్నారం: కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెడ్మ బొజ్జు అన్నారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటును నిరసిస్తూ పోస్ట్‌కార్డుల ఉద్యమంలో భాగంగా సోమవారం జన్నారం మండల కేంద్రంలోని తపాల కార్యాలయం నుంచి మోదీకి పోస్టు కార్డులు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనర్హత వేటు వేసి మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని మండిపడ్డారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ నెల 8న మంచిర్యాలలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు భారీగా జనం తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాసియుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన్న అధికార ప్రతినిధి వెంకటరాజం, నాయకులు ఇందయ్య , గంగన్న యాదవ్, కరుణాకర్, రమేష్, అజారుద్దీన్, ప్రశాంత్, రోహిత్‌దాస్ నరసింగరావు, లక్ష్మి, వసీంపటేల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిన్నయ్యపై కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయికులు

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ వ్యవహారంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని టీపీసీసీ సభ్యులు చిలుముల శంకర్, కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బండి ప్రభాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహిళలను లైంగికంగా వేధిస్తున్నట్లు ఎమ్మెల్యేపై ఆరోపణలు నిత్యకృత్యంగా వస్తున్నాయని తెలిపారు. ఆరిజిన్ డెయిరీలో పెట్టుబడి పెట్టి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయకపోతే ఏసీపీ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడుతామని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు ఆదర్శ్ వర్ధన్ రాజు, రాజలింగు, సరోజ, శివశంకర్, బాకం మల్లేష్, ఎలుక ఆకాశ్, కుమార్ పాల్గొన్నారు.

రక్షణకు ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వర్తించాలి


అవగాహన కల్పిస్తున్న డీజీఎం గోపాల్‌రాజ్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఏరియాలో విధులు నిర్వహించే ఉద్యోగులు, అధికారులు విధి నిర్వహణలో రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ పనులు చేయాలని కార్పొరేట్ డీజీఎం (సేఫ్టీ) జీఎస్ గోపాల్‌రాజ్ అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్, ఏరియా స్టోర్స్‌లలో సోమవారం సేఫ్టీ మేనేజ్‌మెంట్ అమలుపై ఉద్యోగులు, అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎంపీ రూపకల్పన, అమలు, ప్రాధాన్యత అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉద్యోగులకు వివరించారు. ఈ సందర్భంగా గతంలో చోటు చేసుకున్న ప్రమాదాలకు గల కారణాలను వివరిస్తూ భవిష్యత్‌లో అలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. నిర్లక్ష్యం, వేగంగా పనిని ముగించాలనే ఆలోచనలో చేసే తప్పిదాలే ప్రమాదాలకు దారి తీస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం వర్క్‌షాప్ కృష్ణమూర్తి, డీజీఎం స్టోర్స్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘లెదర్ పార్కుకు నిధులు అడ్డుకుంటున్న ఎమ్మెల్యే’

పాతమంచిర్యాల: మందమర్రిలో లెదర్‌పార్క్ ఏర్పాటుకు ఎమ్మెల్యే బాల్క సుమన్ ఉద్దేశపూర్వకంగానే నిధుల కేటాయింపు అడ్డుకుంటున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎం.వి గుణ సోమవారం తెలిపారు. పార్క్ నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తే దళితుల్లో ఒక వర్గం బాగుపడుతుందనే ఉద్దేశంతోనే కుట్ర చేస్తున్నారన్నారు. 10వేల మాదిగ కుటుంబాలు బాగుపడుతాయని, అది ఇష్టంలేని ఎమ్మెల్యే లెదర్‌పార్క్ కోసం ప్రభుత్వం రూ.27 కోట్లు కేటాయించినా వాటిని విడుదల కాకుండా చూస్తున్నారన్నారు. వెంటనే నిధులు విడుదలకు అడ్డు తప్పుకోవాలని కోరారు.

తల్లిదండ్రులకూ పరీక్షే..!


ప్రాథమిక పాఠశాల వద్ద వంటలు సిద్ధం చేస్తున్న తల్లిదండ్రులు

- టెన్త్ విద్యార్థులకు తోడుగా తల్లిదండ్రులు
- కరంజి(టి) విద్యార్థులకు అందర్‌బంద్ ఆశ్రమ పాఠశాలలో పరీక్ష కేంద్రం
- 25 కి.మీ దూరంతో ఆందోళన
- రోడ్డు, రవాణా సౌకర్యం అంతంత మాత్రమే
- అందర్‌బంద్‌కు పిల్లలతో తల్లిదండ్రుల బస
- వారానికి సరిపడా కిరాణా సామగ్రి కొనుగోలు

తాంసి: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. భీంపూర్ మండలంలోని అందర్‌బంద్ గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలోని భీంపూర్, అర్లి(టి), కరంజి(టి), అందర్‌బంద్ పాఠశాలల విద్యార్థులు పరీక్ష రాశారు. కరంజి(టి) నుంచి పరీక్ష కేంద్రానికి సుమారు 25 కి.మీ దూరం ఉంది. రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు గంటకు పైగా ప్రయాణం, దీనికి తోడు అంతరాష్ట్ర రహదారిపై పూర్తిగా గుంతలమయంగా ఉంది. సరైన రవాణా సౌకర్యం లేదు. సకాలంలో చేరుకునే అవకాశం లేకపోవడంతో పిల్లల వెంట తల్లిదండ్రులు అందర్‌బంద్‌కు పయనమయ్యారు. వారానికి సరిపడా కిరాణా సామగ్రిని, ఇతర వస్తువులను కొనుగోలు చేసుకుని అక్కడికి వెళ్లారు.

జీపీ భవనం, ప్రాథమిక పాఠశాలలో బస..

కరంజి(టి) పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి నిత్యావసర సామగ్రితో అందర్‌బంద్‌కు వచ్చారు. పరీక్షలు ముగిసే వరకు పంచాయతీ భవనం, ప్రాథమిక పాఠశాలలో వారు ఉండనున్నారు. వారి సౌకర్యార్థం పంచాయతీ భవనంలో సర్పంచ్ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. విద్యార్థులు ఉదయం పరీక్ష రాస్తుండడం, వారికి సమయానికి వంట సిద్ధం చేసి పెడుతున్నారు తల్లిదండ్రులు. వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రతిఏటా పది పరీక్ష కేంద్రం దూరంగా ఉండటంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని అంటున్నారు. ఇప్పటికైనా అందర్‌బంద్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో వసతి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకపోతే వచ్చే సంవత్సరం అర్లి(టి)లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని ఇబ్బందులు తొలగిపోతాయని అంటున్నారు.

పరీక్ష కేంద్రం మార్చాలి



కరంజి(టి) గ్రామానికి పరీక్ష కేంద్రం దూరంగా ఉండటంతో రావడానికి ఇబ్బంది పడుతున్నాం. గ్రామానికి కనీసం బస్సు సౌకర్యం సరిగ్గా లేదు. తల్లిదండ్రులు తమను తీసుకొచ్చి అక్కడే ఉంచి పరీక్ష రాయిస్తున్నారు. వచ్చే సంవత్సరం పరీక్ష కేంద్రం మార్చాలి.

– డి.అమూల్య, విద్యార్థిని కరంజి(టి)

పరీక్ష కేంద్రం దూరంతో ఇబ్బంది



కరంజి(టి) నుంచి అందర్‌బంద్ పరీక్ష కేంద్రం దూరంగా ఉంది. కేంద్రం రావడానికి సరైన రోడ్డు, రవాణా సౌకర్యం లేదు. కేంద్రానికి సకాలంలో చేరుకునే పరిస్థితి లేదు. వారం పాటు ఇక్కడే ఉండి పరీక్షలు రాయాలని తల్లిదండ్రులతో కలిసి వచ్చి ఇక్కడే ఉంటున్నాం.

– అలాలి చరణ్, విద్యార్థి, కరంజి(టి)

ఇక్కడే ఉంటున్నాం..



పది పరీక్షలు విద్యార్థులు ప్రశాంతంగా రాయాలని వారితో కలిసి అందర్‌బంద్‌లో ఉంటున్నాం. ఇక్కడ ఉండి వారికి భోజనం, ఇతర అవసరాలను దగ్గరుండి చూస్తున్నాం. ప్రతి ఏటా ఇబ్బంది పడుతున్నా పట్టించుకోవడం లేదు. పరీక్ష కేంద్రం మార్చాలి లేకపోతే విద్యార్థుల పరీక్షల సమయంలో అధికారులు వసతులు కల్పించాలి.

– అలాలి రమేశ్, విద్యార్థి తండ్రి, కరంజి(టి)


అందర్‌బంద్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు


అందర్‌బంద్ పంచాయతీ భవనంలో చదువుతున్న విద్యార్థులు